# ప్రజా మాటల్లో

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల   సంపుటి : 05   సంచిక : 223   పేజీలు : 04   వెల రూ. 2   ఆదివారం   22 - 02 - 2026





కొండాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్..

రూ.1,400 కోట్ల విలువైన భూమికి రక్షణ

## పైరవీలు పని చేయవు
# మెరిట్ ఉన్నవారికే పార్టీలో గుర్తింపు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- వికారాబాద్ జిల్లా అనంతగిరిలో డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమం
- శిక్షణా తరగతులను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి హాజరుకానున్న ఖర్గే, కేసీ వేణుగోపాల్
- కాంగ్రెస్ పార్టీలో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే సంస్కృతి, స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్
- మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసిన వాళ్లం అవుతాం
- ఆర్నెళ్ల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ 4 శాతానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెరిగిందన్నారు
- దేశాన్ని ఐక్యంగా ఉంచే కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీని కనుమరుగు చేయాలని కుట్ర జరుగుతోందని రేవంత్ రెడ్డి తెలిపారు



హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీలో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే సంస్కృతి, స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భిన్నాభిప్రా యాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి పార్టీలో లేదన్నారు. మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసిన వాళ్లం అవుతామని పార్టీ నాయకులను ఉద్దేశించి అన్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగించారు.కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేయాలనే కుట్ర జరుగుతోంది : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మెజార్టీ 2 శాతమే తేడా అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్నెళ్ల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ 4 శాతానికి పెరిగిందన్నారు. రెండేళ్ల తర్వాత జరిగిన - మిగతా 2 లో

## ఏఐ సమ్మిట్ వద్ద యూత్ కాంగ్రెస్
# నిరసనలపై కేటీఆర్ స్పందన

- అంతర్జాతీయ సదస్సులను రాజకీయ ప్రదర్శనలకు ఉపయోగించడంపై కేటీఆర్ మండిపాటు
- ఇది దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్య అని వ్యాఖ్య
- ఇలాంటి వేదికల్లో హుందాగా వ్యవహరించాలని సూచన



హైదరాబాద్ : ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ - 2026 వేదిక వద్ద యూత్ కాంగ్రెస్ నాయకులు చేసిన నిరసనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి అంతర్జాతీయ సదస్సులను రాజకీయ ప్రదర్శనలకు ఉపయోగించడం దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్య అని అభివర్ణించారు. అంతర్జాతీయ సదస్సులు దేశ ప్రతిభను, సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపించే వేదికలని అన్నారు. ఇలాంటి వేదికల్లో హుందాగా వ్యవహరించాలని చెప్పారు.రాజకీయ విభేదాలు సహజమే అయినా. అభిప్రాయ భేదాలను వ్యక్తపరచడానికి సరైన సమయం, సరైన వేదిక ఉండాలని కేటీఆర్ అన్నారు. గ్లోబల్ ఈవెంట్‌లలో ఇలాంటి నిరసనలు చేపట్టడం వల్ల భారత్‌పై అంతర్జాతీయంగా ప్రతికూల అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందని విమర్శించారు. ఈ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలోనే యూత్ కాంగ్రెస్ నాయకులు నిరసన చేయడం చాలా విచిత్రంగా ఉందని వ్యాఖ్యానించారు.

## దేశంలోనే ఫాస్టెస్ట్ మెట్రో.. మీరట్‌లో సరికొత్త రికార్డు!

- మీరట్‌లో రూ.12,930 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించిన ప్రధాని
- పూర్తిస్థాయిలో అందుబాటులోకి ఢిల్లీ-మీరట్ నమో భారత్ కారిడార్
- దేశంలోనే అత్యంత వేగవంతమైన మీరట్ మెట్రో సేవలకు శ్రీకారం
- ఢిల్లీ నుంచి మీరట్‌కు కేవలం 58 నిమిషాల్లోనే ప్రయాణం
- ఒకే ట్రాక్‌పై రీజినల్ రైలు, మెట్రో నడవడం దేశంలో ఇదే తొలిసారి





ఢిల్లీ : ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్ మధ్య ప్రయాణాన్ని సులభతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం మీరట్‌లో పర్యటించి సుమారు రూ.12,930 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పర్యటనలో భాగంగా 82 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ-ఘజియాబాద్-మీరట్ 'నమో భారత్' రీజనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ కారిడార్‌ను పూర్తిస్థాయిలో జాతికి అంకితం - మిగతా 2 లో

## నేను పార్టీ అధ్యక్షుడిని అయ్యే నాటికి
# పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉంది

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- పార్టీలో కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని తెలిపిన రేవంత్ రెడ్డి
- నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించానన్న ముఖ్యమంత్రి
- అందరి కృషి వల్ల తెలంగాణలో పార్టీ తిరిగి పుంజుకున్నదన్న ముఖ్యమంత్రి



హైదరాబాద్ : తాను టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీలో కూడా కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని, నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించానని గుర్తుచేసుకున్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నిర్వహించిన - మిగతా 2 లో




## కాంగ్రెస్ కార్యకర్తల నిరసన దిగ్భ్రాంతి కలిగించింది

- ఏపీ మంత్రి నారా లోకేశ్
- ఏఐ సదస్సులో యూత్ కాంగ్రెస్ ఆందోళనపై మంత్రి లోకేశ్ ఆగ్రహం
- దేశ ప్రతిష్ఠ దెబ్బతీసేలా వ్యవహరించారని తీవ్ర విమర్శ
- ప్రతిష్టాత్మక వేదికలను రాజకీయాలకు వాడుకోవడం సరికాదన్న లోకేశ్
- ఆవిష్కరణలపై దృష్టిపెట్టి దేశాన్ని నిర్మించుకోవాలని పిలుపు




అమరావతి : ఢిల్లీలో నిన్న "ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026"లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు సృష్టించిన గందరగోళంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం, విచారం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ - మిగతా 2 లో

## పరీక్షలు ఉన్నాయని ఆందోళన వద్దు

- ఇంటర్ విద్యార్థులకు కవిత సూచన
- ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలని సూచన
- పరీక్షలు బాగా రాయలేననే ఆందోళన వద్దన్న కవిత
- పరీక్షలు అనేవి పూర్తి జీవితంలో చిన్న అంశమని వ్యాఖ్య



2 లో

## దేశంలో ఏ రాష్ట్రమూ ఏపీకి
# దరిదాపుల్లో లేనంత సంక్షేమం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- దేశంలో ఏ రాష్ట్రం ఏపీకి దరిదాపుల్లో లేనంత సంక్షేమాన్ని అందిస్తున్నాం
- పల్నాడు జిల్లా వినుకొండలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి
- ఘన వ్యర్థాల సేకరణ కోసం స్వచ్ఛ రథాన్ని, ఈ-ఆటోలను ప్రారంభించిన చంద్రబాబు
- సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని సూపర్ హిట్ చేసి చూపించామని ఉద్ఘాటన
- ప్రజలకు మెరుగైన జీవనం అందిస్తామని హామీ
- 561 స్వయం సహాయక సంఘాలకు రూ. 100.14 కోట్ల చెక్కు అందజేత




అమరావతి : సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, ఏ రాష్ట్రం కూడా ఏపీకి దరిదాపుల్లో లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో శనివారం జరిగిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తాము ప్రకటించిన సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని సూపర్ హిట్ చేసి చూపించామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని ఆయన పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఘన వ్యర్థాల సేకరణ కోసం ఏర్పాటు చేసిన 'స్వచ్ఛ రథాన్ని', ఈ-ఆటోలను జెండా ఊపి ప్రారంభించారు.

**దేశంలోనే ఏపీ అగ్రగామి**

ప్రజలకు - మిగతా 2 లో

## ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్
# వ్యవహార శైలిపై జగన్ విమర్శలు

- ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ వ్యవహార శైలిపై జగన్ విమర్శలు
- ఏపీ సమ్మిట్‌లో నిన్న మధ్యాహ్నం యూత్ కాంగ్రెస్ కార్యకర్తల నిరసన
- టీ షర్టులు విప్పేసి నినాదాలు చేసిన వైనం
- అందరూ సిగ్గుపడేలా యూత్ కాంగ్రెస్ వ్యవహరించిందన్న జగన్
- టీ-షర్టులపై 'ఎప్‌స్టీన్స్ ఫైల్స్', 'మోదీ రాజీపడ్డారు' వంటి వాక్యాలు, ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫొటోలు ముద్రించి ఉన్నాయి



అమరావతి : ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ఎగ్జిబిషన్ హాల్ నంబర్-5 వద్ద నిరసనకు దిగారు. పదుల సంఖ్యలో వచ్చిన కార్యకర్తలు హఠాత్తుగా టీ-షర్టులు విప్పేసి భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారి టీ-షర్టులపై 'ఎప్‌స్టీన్స్ ఫైల్స్', 'మోదీ రాజీపడ్డారు' వంటి వాక్యాలు, ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫొటోలు ముద్రించి ఉన్నాయి.సదస్సుకు హాజరైన కొందరు ప్రతినిధులు నిరసనకారులను ప్రశ్నించగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. వెంటనే భద్రతా సిబ్బంది జోక్యం చేసుకుని నిరసనకారులను అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటన సదస్సు ప్రాంగణంలో కలకలం రేపింది.ఈ ఘటనపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర విమర్శలు - మిగతా 2 లో

# సంపాదకీయం

## కొరియా న్యాయం



దక్షిణకొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్‌యోల్ ఇక సుదీర్ఘ జైలుజీవితం గడపాల్సి ఉంటుంది. 2024 డిసెంబరులో దేశంలో సైనికపాలన విధించేందుకు ఆయన చేసిన ఓ ప్రయత్నం ఈ శిక్షకు కారణం. పార్లమెంటును అదుపులోకి తీసుకొని, రాజకీయనేతలను అరెస్టు చేయాల్సిందిగా భద్రతాదళాలను ఆదేశించిన ఆయనకు ఈ శిక్షసరిపోదని, మరణశిక్ష విధించాల్సిందేనని ప్రాసిక్యూటర్లు న్యాయస్థానంలో గట్టిగా వాదించారు. సైనికపాలన నిర్ణయాన్ని కొద్దిగంటల్లోనే ఉపసంహరించుకున్నా, తన దుశ్చర్యకు తీవ్ర పశ్చాత్తాపాన్ని ప్రకటించినా, ఆయన అటు అధికారాన్నీ నిలబెట్టుకోలేకపోయారు, ఇటు శిక్షనీ తప్పించుకోలేకపోయారు. ఎంత పెద్ద తప్పుచేసినా తమను తాము సమర్థించుకొనే నాయకులను, వారిని గుడ్డిగా సమర్థించే దిగువస్థాయి నేతలను చూస్తున్న మనకు దక్షిణకొరియా పరిణామాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. అధికారంలోకి వచ్చిన రెండేళ్ళలోనే ఆయన పదవి పోగొట్టుకొనే పరిస్థితులను సృష్టించుకున్నాడు, కుర్చీని రక్షించుకొనే ప్రయత్నంలో మరిన్ని తప్పటడుగులు వేశాడు. భార్యకు గిఫ్ట్‌రూపంలో వచ్చిన ఒక బ్యాగ్ ఈయన రాజకీయజీవితాన్ని తిరగరాసిందంటారు. ఈ మార్షల్ లా ప్రకటించడానికి కొన్ని నెలలముందు ఆమె ఒక పాస్టర్ నుంచి సుమారు లక్షన్నర రూపాయలు విలువచేసే బ్యాగ్‌ను బహుమతిగా స్వీకరించారు. మొదట్లో అధ్యక్షకార్యాలయం దానిని దుష్ప్రచారంగా కొట్టిపారేసినా, ఆ తరువాత వెలుగుచూసిన ఒక వీడియోలో పాస్టర్‌నుంచి ఆమె బహుమతి స్వీకరిస్తున్న దృశ్యాలు బయటపడి, అధ్యక్షకార్యాలయం తప్పు ఒప్పుకోవాల్సివచ్చింది, అధికార పార్టీ క్షమాపణలు కోరింది. పాస్టరే రహస్య కెమెరాతో ఈ ఘట్టాన్ని చిత్రీకరించారనట్టుగా ఓ ప్రచారం ఉంది. అప్పటికే పలు అవినీతి ఆరోపణలతో అధ్యక్షులవారి భార్యపట్ల ప్రజల్లో సదభిప్రాయం లేనందున, ఈ సంఘటన యూన్‌సిక్‌యోల్ పరువుప్రతిష్ఠలను మరింత దిగజార్చింది. ఒక ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టుకోసం అమాంతంగా భూమి ధరలు పెంచారని, అక్రమంగా అనుమతులు ఇచ్చి యోన్ కుటుంబీకులు బాగుపడ్డారని తీవ్రప్రచారం జరిగిన నేపథ్యంలో అధికారపార్టీ నుంచి కొందరు బయటకుపోయారు కూడా. ప్రజల్లో ఆదరణ తగ్గి, నమ్మకం సన్నగిల్లుతున్నప్పుడు నాయకుడు కొత్త ఎత్తులు వేస్తాడు. వారిని మాయచేయగలనని అనుకుంటాడు. ఉత్తరకొరియాను బూచిగా చూపి ప్రజల్లోనూ, స్వపక్షంలోనూ తనపై పెరిగిపోతున్న వ్యతిరేకతని అధిగమించగలనని ఆయన భ్రమపడ్డాడు. విపక్షనేతలు దేశవ్యతిరేకశక్తులనీ, దేశద్రోహులతో రహస్య మంతనాలు సాగిస్తున్నారనీ, దేశం తీవ్ర ప్రమాదంలో పడిందనీ, ఉత్తరకొరియా కమ్యూనిస్టు దళాలనుంచి దానిని రక్షించుకోవాల్సి ఉన్నదనీ బెదిరిస్తూ ఆయన సైనికపాలన విధించాడు. అయితే, ప్రజలూ వారి నాయకులూ ఆయన కుట్రని సాగనివ్వలేదు. తాము ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న నాయకుడు మరో నియంతగా తయారైనాడని గ్రహించిన వేలాది ప్రజలు ఎవరి ప్రోద్బలమూ లేకుండా, స్వల్పకాలంలోనే రోడ్లమీదకు వచ్చి, నినాదాలతో, నిరసనలతో అధినాయకుడిని గడగడలాడించారు. ఉత్తచేతులతో సైన్యం చేతుల్లో ఉన్న తుపాకులు లాక్కున్నారు. స్వపక్ష, విపక్షాలకు చెందిన రెండువందలమంది ఎంపీలు రాత్రికిరాత్రి గేట్లు దూకి, కంచెలు దాటి పార్లమెంట్ భవనంలోకి ప్రవేశించి అక్కడ ఏకకంఠంతో అధ్యక్షుడి నిర్ణయాన్ని తిరగదోడారు. నెత్తిన యుద్ధవిమానాలు తిరిగే వాతావరణంలో బతుకుతూండే దక్షిణకొరియన్లకు పొరుగుదేశం ఎంత ప్రమాదకరమైనదో తెలిసినప్పటికీ, ఉత్తరకొరియా బూచిని చూపి తమ దేశాధ్యక్షుడు తన తప్పుడు పనులను సమర్థించుకోవడానికి వారు ఒప్పుకోలేదు. అధ్యక్షుడి ఆదేశాలు ఉన్నప్పటికీ, జనాన్ని కొట్టకుండా, కాల్చకుండా వారి నిరసనలను సైన్యం గౌరవించడం మరో విశేషం. ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానానికి వారూ వీరూ అన్నతేడాలేకుండా అంతా మద్దతు ఇవ్వడంతో యూన్ సుక్‌యోల్ మారుమాట్లాడకుండా గద్దెదిగాల్సివచ్చింది. తిరుగుబాటుకు ప్రయత్నించారన్న ఆరోపణలమీద ఆయనపై దర్యాప్తు సాగింది. నాలుగుదశాబ్దాల క్రితం వరకూ సైనికపాలనను అనుభవించిన దక్షిణకొరియా ప్రజలు నియంతృత్వం తిరిగి తలెగరేయకుండా జాగ్రత్తపడినందుకు మెచ్చుకోవాలి. దక్షిణకొరియాలో అరెస్టయిన తొలి సిట్టింగ్ ప్రెసిడెంట్‌గా రికార్డులకు ఎక్కిన సుక్‌యోల్ ఇకపై మిగతా జీవితం జైల్లో గడపాల్సివస్తుంది.

# దేశంలో ఏ రాష్ట్రమూ ఏపీకి దరిదాపుల్లో లేనంత సంక్షేమం

మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు అన్నారు. "దేశంలో ఏ రాష్ట్రమూ ఏపీకి దరిదాపుల్లో లేనంత సంక్షేమాన్ని అందిస్తున్నాం. మొదటి తారీఖునే పేదల సేవలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో స్వయంగా పాల్గొంటున్నాను. 'తల్లికి వందనం' ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా ఆర్థిక సాయం అందిస్తున్నాం. 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు మూడు విడతల్లో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నాం" అని వివరించారు.

**మహిళా సాధికారత, ప్రజల భాగస్వామ్యం**

మహిళల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. "స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. వారు ఈ పథకాన్ని చక్కగా వినియోగించుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. లక్ష మంది మహిళలను ఎంఎస్‌ఎంఈలుగా తీర్చిదిద్దుతున్నాం" అని పేర్కొన్నారు. పీ4 కార్యక్రమం కింద ఇప్పటివరకు 10 లక్షల కుటుంబాలను దత్తత తీసుకున్నామని, వారికి మార్గనిర్దేశం చేసేందుకు లక్ష మంది మార్గదర్శులు ముందుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 561 స్వయం సహాయక సంఘాలకు రూ.100.14 కోట్ల చెక్కును అందించారు.

**టెక్నాలజీతో సుపరిపాలన**

పౌర సేవల్లో టెక్నాలజీ వినియోగానికి పెద్దపీట వేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. "దేశంలో ఏ రాష్ట్రం కూడా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సేవలు అందించడం లేదు. త్వరలో విద్యార్థులకు



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో శిక్షణ ఇచ్చేందుకు ఏఐ ట్యూటర్‌ను తీసుకువస్తున్నాం. ఇటీవల బిల్ గేట్స్ కూడా రాష్ట్రానికి వచ్చి రైతులు టెక్నాలజీని వినియోగిస్తున్న తీరును చూసి ఆనందం వ్యక్తం చేశారు" అని గుర్తుచేశారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్, అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు కానున్నాయని వెల్లడించారు.

**ఆరోగ్యానికి భరోసా, వ్యవసాయానికి చేయూత**

ప్రజల ఆరోగ్యం కోసం యూనివర్సల్ హెల్త్ పాలసీ తీసుకువస్తున్నామని, పేద కుటుంబాలకు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా రూ.25 లక్షల వరకు చికిత్స ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. వ్యవసాయంలోనూ టెక్నాలజీని ప్రవేశపెట్టి సాగును సులభతరం చేస్తామన్నారు. రైతులు పండించే పంటలకు మార్కెట్ ధర అందేలా, సాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినుకొండను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే ఆలోచన ఉందన్నారు.

**స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా పటిష్ఠ చర్యలు**

స్వచ్ఛమైన వాతావరణం కల్పించడమే 'స్వచ్ఛాంధ్ర' లక్ష్యమని సీఎం అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ నేతృత్వంలో ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా సాగుతోందన్నారు. "గత పాలకులు వదిలేసిన 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించే బృహత్తర కార్యక్రమం చేపట్టాం. మార్చి నాటికల్లా గ్రామీణ ప్రాంతాల్లో వందశాతం డోర్ టు డోర్ చెత్త సేకరణ పూర్తి చేస్తాం" అని ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించామని, దీనివల్ల పశువులు, ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని వివరించారు.

**చెత్త నుంచి సంపద.. మారాల్సిన తీరు**

చెత్తను సంపదగా మార్చే ప్రక్రియను ప్రోత్సహిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "విశాఖ, గుంటూరులలో చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్లు ఉన్నాయి. రాజమండ్రితో పాటు మరో 5 ప్లాంట్లు త్వరలో ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలో 4 లక్షలకు పైగా కుటుంబాలు హోం కంపోస్టింగ్ ద్వారా ఎరువు తయారు చేసుకుంటున్నాయి" అని ప్రశంసించారు. చెత్త నిర్వహణలో జపాన్ పౌరుల తరహాలో మన ఆలోచనా తీరు మారాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, గొట్టిపాటి రవికుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు పాల్గొన్నారు.

# పైరవీలు పని చేయవు - మెరిట్ ఉన్నవారికే పార్టీలో గుర్తింపు

**మొదటిపేజీ తరువాయి** - మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ 12 శాతమని వివరించారు. కార్యకర్తల కృషి, ప్రజల నమ్మకం వల్లే కాంగ్రెస్ ఓటు శాతం పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ కుటుంబంలో 3 తరాలు దేశం కోసం ప్రాణాలు అర్పించారని, ఆయనకు సొంత ఇల్లు కూడా లేదన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన రాహుల్‌గాంధీ కుటుంబంపై ఇవాళ నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని ఐక్యంగా ఉంచే కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీని కనుమరుగు చేయాలని కుట్ర జరుగుతోందని రేవంత్ రెడ్డి తెలిపారు. పార్టీ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ పైరవీల కోసం తిరిగితే ప్రజల్లో, పార్టీలో చులకన అవుతారని రేవంత్ రెడ్డి సూచించారు. వాటిని వదిలేసి ప్రజల తరఫున పోరాడితే గౌరవం, మర్యాద తప్పక పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. సొంత అజెండా వదిలేసి ప్రజా అజెండా, పార్టీ అజెండా కోసం కృషి చేయాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. సమస్యలపై కొట్లాడితే స్వపక్షంతో పాటు విపక్షం కూడా గౌరవిస్తుందన్నారు. "నేను పీసీసీ అధ్యక్షుడిని అయ్యే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉండేది. పార్టీలోనూ కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నాను. నేతలందరినీ కలిసి నా ఆలోచనలు చెప్పి అందరినీ ఒప్పించాను. అందరం కృషి చేయడంతో పార్టీ ఓటింగ్ 2.5 శాతం నుంచి 40 శాతానికి చేరింది. డీసీసీ అధ్యక్షులుగా బాగా పని చేసిన వారికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చాం. పార్టీ కోసం కృషి చేసిన మరో 60 మందికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చాం. ఎమ్మెల్యే టికెట్లు పొందలేని వారికి ఎమ్మెల్సీలు ఇచ్చాం. పార్టీలో అందరి పని తీరు మీద నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. మెరిట్ ఉన్న వారికి పార్టీలో కచ్చితంగా న్యాయం జరుగుతుంది. గాంధీ కుటుంబం దేశం కోసం ప్రాణాలర్పించింది : మోతీలాల్ నెహ్రూ రూ.వేల కోట్ల ఆస్తులను దేశం కోసం త్యాగం చేశారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశం కోసం ఎన్నో ఏళ్లు జైలులో ఉన్నారన్నారు. ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన కొన్నాళ్లకే గాంధీజీని కోల్పోయామన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని సీఎం గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారని రేవంత్



వివరించారు. డీసీసీ పదవి చాలా విలువైనదని, వచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేసుకోవద్దని కోరారు. డీసీసీ నుంచి పీసీసీ, ఎమ్మెల్యే, ఎంపీ, సీఎం కావొచ్చన్నారు. ఏఐసీసీ ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ జిల్లా అధ్యక్షులకు (డీసీసీ) శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. మార్చి 2 వరకు డీసీసీ శిక్షణా తరగతులు జరగనున్నాయి. ఈ కార్యక్రమాలకు ఖర్గే, కేసీ వేణుగోపాల్‌లు హాజరు కానున్నారు. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి.

# నేను పార్టీ అధ్యక్షుడిని అయ్యే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉంది

**మొదటిపేజీ తరువాయి** - ఏపీ, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీలో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీలో లేదని వెల్లడించారు. మనలో మనం కొట్టుకుంటే పార్టీలో కష్టపడి పనిచేసే లక్షలాది మంది కార్యకర్తలకు అన్యాయం చేసినట్లు అవుతుందని అన్నారు. అందరి కృషి వల్లే తెలంగాణలో పార్టీ తిరిగి పుంజుకున్నదని అన్నారు. డీసీసీ అధ్యక్షులుగా బాగా పనిచేసిన వారికి ఎమ్మెల్యే టిక్కెట్లు ఇచ్చామని, ఎమ్మెల్యే టిక్కెట్లు రాని వారికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చామని తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన మరో అరవై మందికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు. పార్టీలో అందరి పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని హెచ్చరించారు. పార్టీ కోసం శ్రమించే వారికి కచ్చితంగా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. మెరిట్ ప్రకారమే పార్టీలో అవకాశాలు వస్తాయన్నారు. డీసీసీ పదవి ఎంతో విలువైనదని, దీనిని ఏమాత్రం దుర్వినియోగం చేసుకోవద్దని హితవు పలికారు. మంచి ప్రతిభ కనబరిస్తే ఆ తర్వాత ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి కూడా కావొచ్చని అన్నారు. నాయకులు ఎప్పుడూ ప్రజల్లో ఉండాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారని అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని గుర్తుచేశారు. మోతీలాల్ నెహ్రూ దేశం కోసం వేల కోట్ల రూపాయలను ఆ రోజుల్లోనే త్యాగం చేశారని, జవహర్ లాల్ నెహ్రూ జైల్లో ఉన్నారని తెలిపారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు



అర్పించారని తెలిపారు.

# పరీక్షలు ఉన్నాయని ఆందోళన వద్దు



**మొదటిపేజీ తరువాయి** - తెలంగాణలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈ నెల 25వ తేదీ నుంచి జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విద్యార్థులకు సూచనలు చేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా, పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షల్లో ఆందోళనకు గురికాకుండా ఎంత వస్తే అంత రాయాలని సూచించారు. ఫలితాల కోసం ఏమాత్రం ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. పరీక్షలు బాగా రాయలేనేమోననే ఆందోళనతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు వార్త చూశానని, కాబట్టి ఫలితాల గురించి భయపడవద్దని అన్నారు. పరీక్షలు అనేవి జీవితంలో చిన్న పందెమని గుర్తుంచుకోవాలని సూచించారు. ఒక పరీక్ష సరిగ్గా రాయకుంటే మన జీవితం అంతటితో ఆగిపోదని అన్నారు. పరీక్షల తర్వాత ఎంతో జీవితం ఉందని వ్యాఖ్యానించారు. పరీక్షల భయంతో ఏదైనా చేసుకుంటే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎంత క్షోభిస్తారో గుర్తుంచుకోవాలని అన్నారు. పరీక్షల వంటి చిన్న చిన్న అంశాలను దాటుకుంటూ వెళితే జీవితంలో పెద్ద పెద్ద వాటిని సులభంగా ఎదుర్కోవచ్చని అన్నారు.

# దేశంలోనే ఫాస్టెస్ట్ మెట్రో.. మీరట్‌లో సరికొత్త రికార్డు!



**మొదటిపేజీ తరువాయి** - చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ 'మీరట్ మెట్రో' సేవలను కూడా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు మెట్రోలో ప్రయాణించారు. తాజా ప్రారంభోత్సవంతో ఢిల్లీలోని సారాయ్ కాలే ఖాన్ నుంచి మీరట్‌లోని మోదీపురం వరకు ప్రయాణ సమయం కేవలం 58 నిమిషాలకు తగ్గనుంది. ఇంతకుముందు ఈ ప్రయాణానికి దాదాపు మూడు గంటల సమయం పట్టేది. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే మీరట్ మెట్రో, దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలవనుంది. మరో విశేషమేమిటంటే, ఒకే రైల్వే ట్రాక్‌పై రీజనల్ రైలు (నమో భారత్), లోకల్ మెట్రో (మీరట్ మెట్రో) నడవడం దేశంలో ఇదే తొలిసారి. ఈ కొత్త విధానం పట్టణ రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రద్దీ తగ్గడంతో పాటు పర్యావరణ హితమైన రవాణాకు మార్గం సుగమం అవుతుందని ప్రభుత్వం తెలిపింది.


# కాంగ్రెస్ కార్యకర్తల నిరసన దిగ్భ్రాంతి కలిగించింది

**మొదటిపేజీ తరువాయి** - వేదికపై వారి ప్రవర్తన దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. ఏఐ రంగంలో ఎదుగుతున్న భారత్ శక్తిని ప్రపంచానికి చాటేందుకు ఉద్దేశించిన సదస్సులో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ మేరకు లోకేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఏఐ సూపర్ పవర్‌గా భారత్ ఎదుగుతున్న తీరును ప్రదర్శించేందుకు ఈ సదస్సు ఒక గొప్ప అవకాశం. అలాంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ కార్యక్రమాన్ని రాజకీయ వేదికగా మార్చడం ద్వారా ప్రపంచం ముందు మనందరి ప్రతిష్ఠను తగ్గించారు. ఇది దిగ్భ్రాంతికరం, విచారకరం" అని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశం ఇంతకంటే మెరుగైన గౌరవానికి అర్హమైనదని ఆయన అభిప్రాయపడ్డారు. "మనం ఇలాంటి చిల్లర రాజకీయాలను పక్కనపెట్టి, ఆవిష్కరణలు, నైపుణ్యం ద్వారా దేశ నిర్మాణానికి ప్రాధాన్యత ఇద్దాం" అని లోకేశ్ పిలుపునిచ్చారు. దేశ ప్రతిష్ఠకు సంబంధించిన విషయాల్లో రాజకీయాలు చేయడం తగదని ఆయన హితవు పలికారు.

# ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ వ్యవహార శైలిపై జగన్ విమర్శలు

**మొదటిపేజీ తరువాయి** - గుప్పించారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... ఏఐ సమ్మిట్ లో మనమంతా సిగ్గుపడేలా యూత్ కాంగ్రెస్ వ్యవహరించిందని మండిపడ్డారు. మన రాజకీయాలు ఎటువైపు వెళుతున్నాయని ప్రశ్నించారు. మన దేశాన్ని ఎవరూ, ఎప్పుడూ కించపరచకూడదని చెప్పారు. మన మధ్య ఎలాంటి రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ... ప్రపంచం ముందు అందరం ఐక్యంగా ఉండాలని అన్నారు.

# ఢిల్లీ ఎర్రకోట వద్ద పేలుళ్లకు లష్కరే కుట్ర!



**మొదటిపేజీ తరువాయి** - ఢిల్లీలోని ఎర్రకోట, చాందినీ చౌక్‌లోని ఒక ఆలయం మరియు దేశవ్యాప్తంగా ఉన్న ఇతర ప్రధాన దేవాలయాల సమీపంలో పేలుళ్లు జరపాలని పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ప్లాన్ చేస్తోందని సమాచారం. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని ఒక మసీదులో ఫిబ్రవరి 6న జరిగిన పేలుడుకు ప్రతీకారంగా ఈ దాడులకు ప్లాన్ చేస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. భద్రతా సంస్థల సమాచారం ప్రకారం, లష్కరే తోయిబా ఉగ్రవాదులు ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (ఐఈడీ) ద్వారా దాడికి కుట్ర పన్నుతున్నట్లు తెలిసింది. ఫిబ్రవరి 6న ఇస్లామాబాద్‌లోని మసీదులో జరిగిన పేలుడుకు ప్రతీకారం తీర్చుకోవడమే ఈ కుట్ర వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని భద్రతా బలగాలు వెల్లడించాయి.

# ఏపీ లిక్కర్ కేసులో కీలక మలుపు.. వాసుదేవరెడ్డి అరెస్ట్

**ఏపీబీసీఎల్ మాజీ ఎండి వాసుదేవరెడ్డిని అరెస్ట్ చేసిన సీఐడీ**

**ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, కీలక పత్రాలు చోరీ చేశారంటూ కేసు నమోదు**

**ఇప్పటి వరకు అజ్ఞాతంలో ఉన్న వాసుదేవరెడ్డి**

ఏపీ లిక్కర్ స్కామ్ దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. తాజాగా మరో అరెస్ట్ జరిగింది. ఆంధ్రప్రదేశ్ బెవరేజెస్ కార్పొరేషన్ (ఏపీబీసీఎల్) మాజీ ఎండీ, ఐఆర్టీఎస్ అధికారి వాసుదేవరెడ్డిని సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. వైసీపీ హయాంలో జరిగిన మద్యం స్కాంకు సంబంధించి విజయవాడలోని ఏపీబీసీఎల్ కార్యాలయం నుంచి ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, కీలక పత్రాలను చోరీ చేశారంటూ ఆయనపై ఫిర్యాదు అందింది. ఈ క్రమంలో ఆయనపై ఆధారాల ధ్వంసం, చోరీ, నేరపూరిత కుట్ర అభియోగాలతో 2024 జూన్‌లో కేసు నమోదు అయింది. ఈ కేసులో ఆయన ఏ2గా ఉన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో సీఐడీ సోదాలకు వెళ్లిన సమయంలో వాసుదేవరెడ్డి పరారయ్యారు. అప్పటి నుంచి అజ్ఞాతంలో ఉండగా... తాజాగా సీఐడీ పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు.



# సీనియర్ సిటిజెన్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

## జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్



**జగిత్యాల, ఫిబ్రవరి 21 (ప్రజా మంటలు):**సీనియర్ సిటిజెన్ల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్ అన్నారు. శనివారం జగిత్యాలలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీనియర్ సిటిజెన్స్, పెన్షనర్స్ సంఘాల ప్రతినిధులుజిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలోఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. అనంతరం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ రూపొందించిన వయోవృద్ధుల సంరక్షణపోషణ చట్టం మరియు పెన్షనర్స్ సర్వీస్ రూల్స్ పుస్తకాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో జిల్లా కేంద్రంలోని తారకరామ నగర్‌లో రూ. కోటి వ్యయంతో ప్రభుత్వ వృద్ధాశ్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే జగిత్యాల పట్టణ బైపాస్ రోడ్డులో డే కేర్ సెంటర్ ప్రారంభించి, అక్కడ సీనియర్ సిటిజెన్లకు ఉచిత అల్పాహారం, వైద్య సేవలు, వినోద కార్యక్రమాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. హరి అశోక్ కుమార్ వినతి మేరకు పెన్షనర్ల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వయోవృద్ధులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న సీనియర్ సిటిజెన్స్, పెన్షనర్స్ సంఘాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్‌తో పాటు వారి సంఘాల ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, కార్యదర్శి గౌరి శెట్టి విశ్వనాతం, పెన్షనర్ల జిల్లా కార్యదర్శి పి.సి. హన్మంత్ రెడ్డి, సీనియర్ సిటిజెన్స్ ఉపాధ్యక్షులు పి. అశోక్ రావు, కోశాధికారి వి. ప్రకాష్ రావు, సంయుక్త కార్యదర్శి ఎం.డి. యాకూబ్, కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం, జగిత్యాల యూనిట్ అధ్యక్షులు బి. రాజేశ్వర్, నాయకులు కొక్కుల ఆంజనేయులు, నాయిని సంజీవ రావు, సత్యనారాయణ, బాలయ్య, కట్ట గంగాధర్, కరుణ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ బోర్డు ను ముట్టడించిన జాగృతి విద్యార్థి నాయకులు



**హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ప్రజా మంటలు):**నాంపల్లిలో ఇంటర్మీడియట్ బోర్డును ముట్టడించిన తెలంగాణ జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యాలయాన్ని తెలంగాణ జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు ముట్టడించారు. అనుమతి లేని ఇంటర్ కాలేజీలకు బోర్డు కొమ్ముకాస్తూ, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని విద్యార్థి నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. అనుమతి లేని కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని, వారికి పరీక్షలు రాసేందుకు తక్షణమే అనుమతి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంలో బోర్డు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని, వేలాది మంది విద్యార్థుల జీవితాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆందోళన ఉద్రిక్తతకు దారితీయడంతో పోలీసులు జోక్యం చేసుకుని విద్యార్థి నాయకులను అరెస్ట్ చేసి సమీప పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ అరెస్టులను ఖండిస్తూ తెలంగాణ జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్ నేతలు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# యూరియా యాప్ తో రైతులను ఇబ్బందులు పెడుతున్న ప్రభుత్వం

## ఇలాగే కొనసాగితే ధర్నాలు రాస్తారోకోలు చేస్తామని ప్రభుత్వానికి డిమాండ్

## తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరి రాములు



**ఎల్కతుర్తి ఫిబ్రవరి 21 ప్రజా మంటలు :** యూరియా యాప్ తో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఒక ప్రకటన ద్వారా తెలంగాణ రైతు సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్కూరి రాములు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా వలన రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. కేంద్రాల అధికారులు సమయం కేటాయించి బుకింగ్ చేస్తున్నారని ఆ సమయంలో ఓటీపీలు పంపి సబ్మిట్ చేసే సమయానికి నిలువలు సున్న చూపుతున్నారని నిమిషాల సమయంలోనే యూరియా నీలువలు ఖాళీ అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు సెల్ ఫోన్ పట్టుకొని యాప్ అర్థం కాక దిక్కులు చూస్తున్నారని గత ఖరీఫ్ లో కూడా వీడియో కోసం నాన్న అవస్థలు పడ్డారని ఇప్పుడు యాప్ పెడితే ఇబ్బందులు తగ్గుతాయని రబి సీజన్లో కూడా రైతులు యూరియా కోసం అవస్థలు పడుతున్నారని కొంతమంది రైతులకు స్మార్ట్ ఫోను లేక ఉన్నవారికి అర్థం చేసుకోక నిరక్షరాశులయిన రైతుల యూరియా విధానాన్ని కష్టాలు పడుతున్నారని అందువల్ల రైతులకు సరిపడా యూరియా పిఏసి ఎస్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచి వారి ఇబ్బందులను తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ వ్యవస్థ ఇలాగే కొనసాగితే తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు రాస్తారోకలు చేస్తామని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నాము.

# కాకతీయ వన విహార్ ను సందర్శించిన అల్టి ట్యూడ్ విద్యార్థులు





**ఎల్కతుర్తి ఫిబ్రవరి 21 ప్రజా మంటలు :**ఎల్కతుర్తి మండలంలోని అల్టి ట్యూడ్ హై స్కూల్ విద్యార్థులు కాకతీయ వనవిహార్ ను విద్యా విహారంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు విద్యార్థులకు అటవుల ప్రాముఖ్యత అటవీ సంపద ప్రయోజనాలు మరియు సంరక్షణ అవసరం పై విస్తృతంగా అవగాహన కల్పించారు. సుమారు 89 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న కాకతీయ వనవిహార్ లో అనేక రకాల ఔషధ మొక్కలు విభిన్న జాతుల చెట్లు మరియు విశాలమైన లోటస్ పాండ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రకృతి మధ్యలో విద్యార్థులు సంచరిస్తూ వృక్షజాలం పక్షిజాలం జీవ వైవిధ్యం గురించి తెలుసుకున్నారు. పిల్లల కోసం ఏర్పాటుచేసిన ఆట వస్తువులు వారికి ఆనందాన్ని కలిగించాయి. సెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, అ టవులు భూమికి ఊపిరితిత్తులవంటివని అవి ఆక్సిజన్ ను గ్రహించడం ద్వారా గాలి కాలుష్యాన్ని తగ్గిస్తాయని వివరించారు. అ టవులు వర్షాపాతం సమతూల్యతకు దోహదపడటమే కాకుండా భూక్షయాన్ని అరికట్టి నేల సారాన్ని కాపాడుతాయని తెలిపారు. అడవులు తగ్గిపోవడం వల్లే వన్యప్రాణులు నివాసాలను కోల్పోయి గ్రామాల వైపు వస్తున్నాయని కనుమరుగవుతున్న జంతు జాతులను రక్షించడం మనందరి బాధ్యత అని చెప్పారు. ప్రతి ఒక్కరూ చెట్లు నాటడం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం నేటి వనరులను సంరక్షించడం ద్వారా అ టవులను కాపాడాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ పుస్కూరి కార్తీక్ రావు మాట్లాడుతూ, చిన్ననాటి నుంచే పిల్లల్లో పర్యావరణం పై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అటవుల వల్ల మనకు వర్షాలు ఔషధ సంపద కలప పండ్లు తేనె వంటి అనేక సహజ వనరులు లభిస్తాయని తెలిపారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలను ఫారెస్ట్ డిపార్ట్మెంట్ మరింతగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ప్రకృతి పరిరక్షణ పై చైతన్యం పొందారు. అ టవుల ప్రాధాన్యం గాలి కాలుష్య నియంత్రణ వర్షపాతం సమతుల్యత జీవ వైవిధ్య పరిరక్షణ భూక్షయం నివారణ వన్యప్రాణుల రక్షణ వంటి అంశాల్లో కీలకమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు, పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, ఉపాధ్యాయులు మమత, స్వప్న, కావ్య, కవిత, అనూష, తదితరులు పాల్గొన్నారు.

# ఎర్దండి గ్రామ శివారులో అనుమానాస్పద మృతి

## కుటుంబ కలహాల నేపథ్యంలో కేసు నమోదు



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 21 (ప్రజా మంటలు-దగ్గుల అశోక్) :** ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామ శివారులో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాశెట్టి గణేష్‌కు చెందిన వ్యవసాయ భూమిలో ఎర్రోళ్ల లింబాద్రి (51), తండ్రి గంగారం, నివాసం మొగిలిపేట (మల్లాపూర్ మండలం) మృతదేహం లభ్యమైంది. మృతుడి తలకు తీవ్ర గాయాలు ఉండటంతో పాటు రక్తస్రావం జరిగి, బోర్లబొక్కలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలానికి సమీపంలో రోడ్డు పక్కన అతని ద్విచక్ర వాహనం పడిపోయి ఉంది. పోలీసుల సమాచారం ప్రకారం, లింబాద్రి గత కొన్నేళ్లుగా కుటుంబ కలహాలతో భార్యకు దూరంగా ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో భార్య, పిల్లలతో గొడవ జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కుటుంబ వివాద కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎర్దండి గ్రామపంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు కాగా, పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

# ఏఐఎస్ఎఫ్ తెలంగాణ నాలుగో మహాసభలు

## రెండోసారి రాష్ట్ర సమితికి భాషబోయిన సంతోష్, ఉట్కూరి ప్రణీత్ గౌడ్ ఎన్నిక



**ఎల్కతుర్తి, ఫిబ్రవరి 21 (ప్రజా మంటలు):**నిజాంబాద్‌లో ఫిబ్రవరి 18, 19, 20 తేదీలలో ఘనంగా నిర్వహించిన ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలు విద్యార్థి ఉద్యమంలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఈ మహాసభల్లో ఎల్కతుర్తి మండలానికి చెందిన భాషబోయిన సంతోష్, ఉట్కూరి ప్రణీత్ గౌడ్ రెండోసారి రాష్ట్ర సమితి సభ్యులుగా ఎన్నిక కావడం మండలంతో పాటు జిల్లా విద్యార్థి ఉద్యమానికి గర్వకారణంగా నిలిచింది. విద్య హక్కు కోసం నిరంతర పోరాటం భాషబోయిన సంతోష్ హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన భాషబోయిన సంతోష్ గ్రామస్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు విద్యార్థి ఉద్యమంలో అంకితభావంతో పనిచేస్తున్నారు. హాస్టల్ సమస్యలు, ఫీజు బకాయిలు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, కార్పొరేట్ విద్యాసంస్థల అక్రమాలపై ఆయన నిర్వహించిన పోరాటాలు విశేష గుర్తింపు పొందాయి. ప్రస్తుతం ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న సంతోష్ రెండోసారి రాష్ట్ర సమితికి ఎన్నిక కావడం ఉద్యమంలో ఆయన పాత్రను స్పష్టంగా చూపిస్తోంది. సిద్ధాంత నిబద్ధతకు ప్రతీక ఉట్కూరి ప్రణీత్ గౌడ్ఎల్కతుర్తి మండలం గోపాల్పూర్ గ్రామానికి చెందిన ఉట్కూరి ప్రణీత్ గౌడ్ గత 12 సంవత్సరాలుగా విద్యార్థి ఉద్యమంలో క్రియాశీలకంగా కొనసాగుతున్నారు. సమాన విద్యా హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన ఉద్యమాలు విశేష గుర్తింపు తెచ్చాయి. ప్రస్తుతం ఆయన ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉద్యమ విలువలకు కట్టుబడి జీవన విధానంలోనూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎల్కతుర్తి మండలానికి గర్వకారణంఇద్దరు యువ నాయకులు రెండోసారి రాష్ట్ర సమితికి ఎన్నిక కావడం గ్రామీణ ప్రాంతాల నుంచి ఎదుగుతున్న విద్యార్థి ఉద్యమ శక్తిని ప్రతిబింబిస్తోంది. విద్యను వ్యాపారంగా మార్చే విధానాలకు వ్యతిరేకంగా, సమాన విద్యా హక్కుల సాధన దిశగా తమ పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని మహాసభలు పిలుపునిచ్చాయి. వీరి నాయకత్వంలో విద్యార్థి ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా మరింత ప్రభావవంతంగా ముందుకు సాగుతుందని విద్యార్థులు, ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# జాతీయ రహదారి డివైడర్ లపై

## సర్వాయ్ పాపన్న చాకలి ఐలమ్మ,

## విగ్రహాలు ఏర్పాటు చేయాలి



**హుస్నాబాద్ ,ఫిబ్రవరి21,(ప్రజా మంటలు)** :సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపల్ పట్టణంలోదేశ ప్రజల కోసం జీవితాలను త్యాగం చేసిన మహనీయుల విగ్రహాలు పట్టణం లోని జాతీయ రహదారి డివైడర్ లపై ఏర్పాటు చేయాలని కోరుతూ బి ఆర్ యస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని కోరుతూ హుస్నాబాద్ మున్సిపల్ మేనేజర్ సంపత్ రావుకు వినతిపత్రం సమర్పించిన హుస్నాబాద్ బీఆర్ఎస్ నాయకులు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ రజాకార్లను గడగడలడించిన తెలంగాణ సాయిద పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ, సర్వాయ్ పాపన్న, జ్యోతి రావు సావిత్రిబాయి పూలే, బాబు జగ్జీవన్ రావు లతోపాటు హుస్నాబాద్ ప్రాంతంలో పేదలకు సేవలు అందించిన చెందిన మాజీ శాసన సభ్యులు దివంగత బొప్పరాజు లక్ష్మి కాంతారావు, దేశిని చిన్న మల్లయ్య ల విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు .ఈ కార్యక్రమం లో బి ఆర్ యస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, పట్టణ యూత్ అధ్యక్షులు మేకల వికాస్ యాదవ్,అరవింద్ గౌడ్, శివ రామ్ ఉన్నారు.

# బ్రహ్మోత్సవాల సమన్వయ సమావేశం ఏర్పాటు

## చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**గొల్లపల్లి ఫిబ్రవరి 21ప్రజా మంటలు** :ధర్మపురి పట్టణ కేంద్రంలోని ఓల్డ్ టిటిడి లో శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల (జాతర) ఏర్పాట్లపై శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారుఈ సమావేశంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్రాబోయే బ్రహ్మోత్సవాలను భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులు చర్చించారుభద్రత, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుధ్యం, వైద్య సదుపాయాలు తదితర అంశాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి రాజేష్, ఆలయ చైర్మన్ జక్కు రవీందర్, పోలీస్ శాఖ సిఐ, రామ్ నరసింహారెడ్డి, ఎస్సైలు కృష్ణ సాగర్ రెడ్డి, ఉదయ్,తదితర సంబంధిత అధికారులు పాలొగొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులతో ఇబ్రహీంపట్నం గ్రామ నివాసి ఉరి పెట్టుకొని ఆత్మహత్య



**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 21 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :**ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన లక్కం రాజశేఖర్ తండ్రి గంగారం,45 సం.లు, కులం: ఎస్సీ మాల అనునతడు ఆర్థిక ఇబ్బందులు ఉన్నందున జీవితంపై విరక్తి చెంది గత మూడు రోజుల క్రితం అతని భార్య తన తల్లి గారి ఇంటికి వెళ్లగా శు క్రవారం రోజున రాత్రి ఇంట్లో పడుకున్న తర్వాత ఇంట్లో ఎవరు లేని సమయంలో తన ఇంట్లోని ఫ్యాన్ కి లుంగీ సహాయంతో ఊరుపెట్టుకొని మరణించినాడని శనివారం రోజున ఉదయం ఎంతసేపైనా మృతుడు ఇంట్లో నుండి బయటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన మృతుడి అన్న ఆయన లక్కం శ్రీనివాస్ తండ్రి గంగారం,52 సంలు అనునతడు ఇంటికి వెళ్లి చూడగా మరణించి ఉన్నట్లుగా గమనించినానని అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించనైనది. ఎస్సై జి నవీన్ తెలిపారు

# భారత సైన్యంలో చేరి దేశానికి సేవ చేయండి

## యువతకు ఎయిర్ వెటరన్ రాజా నరసింహారావు సూచన



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):**దేశం పట్ల అభిమానం కలిగిన యువతీ యువకులు అగ్నివీర్ పథకం ద్వారా భారత సైన్యంలో చేరి మాతృభూమికి సేవ చేయాలని భారతీయ వాయుసేనలో సేవలందించిన ఎయిర్ వెటరన్ రాజా నరసింహారావు సూచించారు. పరిధిలోని డిస్ట్రిక్ట్ 320ఎ ఆధ్వర్యంలో సంస్థ యువత, గ్రాడ్యుయేట్లు మరియు గృహిణుల కోసం ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణతో పాటు జాబ్ మేళాను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 22 వరకు సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్ లో జరుగుతోంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...18 ఏళ్ల వయస్సు కలిగి పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు అగ్నివీర్ పథకం ద్వారా పరీక్ష రాసి భారత సైన్యంలో చేరవచ్చని తెలిపారు. ఎంపికైన వారు నాలుగేళ్లపాటు సైనికులుగా సేవలందించే అవకాశం ఉంటుందని చెప్పారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ అవకాశాలు కూడా లభిస్తాయని వివరించారు. ఇటీవల 46 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు పేర్కొంటూ, ఆసక్తిగల యువతీ యువకులు అగ్నివీర్ పథకానికి దరఖాస్తు చేస్తే వారికి ఉచితంగా మార్గదర్శనం అందిస్తానని రాజా నరసింహారావు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో సమయం ఎంతో విలువైనదని, దానిని వృథా చేయకుండా ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆయన సూచించారు.

# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశానికి సీనియర్ కాంగ్రెస్

## నాయకులు జువ్వడి కృష్ణారావు



**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 21 (ప్రజా మంటలు దగ్గుల అశోక్) :**ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ తండా గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు శనివారం గృహప్రవేశం చేశారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ జువ్వాడి కృష్ణారావు విచ్చేశారు.. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి, తిమ్మాపూర్ తాండ గ్రామ శాఖ అధ్యక్షుడు మహిపాల్, సర్పంచులు నాగేష్ పురుషోత్తం మాజీ సర్పంచ్ ఆనంద్ మాజీ ఎంపీటీసీ బోరిగం మహేష్ జలేష్ గడ్డం శంకర్ రెడ్డి గంగారెడ్డి రెబ్బటి రంజిత్ వాల్గోట్ నరేష్ ఓద్దే సోమేష్ గణేష్ పవన్ సాయన్న రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎండి పీడియాట్రిక్ సీట్ సాధించిన కావ్యను

## అభినందించిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



**జగిత్యాల ఫిబ్రవరి 21 (ప్రజా మంటలు)** :అర్బన్ మండలం మోతే గ్రామానికి చెందిన రైతు పోచయ్య కూతురు గొల్ల కావ్య ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎండి పీడియాట్రిక్ సీటు సాధించి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలవగా గొల్ల కావ్య కు శుభాకాంక్షలు తెలిపి అభినందించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేష్ మాజీ ఉప సర్పంచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన 25, 32 వ వార్డు కౌన్సిలర్లు





**జగిత్యాల ఫిబ్రవరి 21 (ప్రజా మంటలు) :**

జగిత్యాలలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగాజగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ని వారి నివాసం లో కలిసి ఎమ్మెల్యేను సత్కరించిన జగిత్యాల 25వ వార్డు కౌన్సిలర్ సామల్ల జమున రాజశేఖర్,32వ వార్డు కౌన్సిలర్ బదుగు పద్మ రాజేష్ దంపతులు కాగా వారికి ఎమ్మెల్యే శు భాకాంక్షలు తెలిపారు.

# జిల్లాలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**జగిత్యాల ఫిబ్రవరి 21 (ప్రజా మంటలు)** :జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం వచ్చేనెల మార్చి 14 తేది నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్ష సెంటర్లలో పూర్తి వసతి ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఎస్ ఎస్ సి విధులు నిర్వహించే సూపరింటెండెంట్ లకు డిపార్ట్మెంటల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం శనివారం రోజున కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని మండల విద్యాధికారులు(20) కేటాయించబడిన సియస్(68) లు మరియు డీఓ(68) లు, కస్టోడియన్లు (8), వాహన ఇంచార్జిలు (20) హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూవిద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన పదవ తరగతి పరీక్షలు ఎలాంటి లోపాలు లేకుండా జరగాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి చరవాణి ల అనుమతి ఇవ్వకూడదని, ప్రతిఒక్కరు ఐడి కార్డు వేసుకోవాలని, పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, కూర్చోవడానికి సరిపడా బెంచీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి ప్రశాంత వాతావరణం కల్పించాలని పోలీస్ శాఖకు ఆదేశించారు. ప్రశ్నపత్రాల రవాణా, భద్రతా చర్యలు కట్టుదిట్టంగా ఉండాలని తెలిపారు. పరీక్షల సమయంలో ఎటువంటి మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు అప్రమత్తంగా పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఓ రాము, జిల్లా పరీక్షల విభాగం అధికారి నరేందర్, జిల్లా కోఆర్డినేటర్స్ లు, మండల విద్యాధికారులు, సియస్ లు, డీఓలు, కస్టోడియన్లు, వాహన ఇంచార్జిలు జిల్లా కోఆర్డినేటర్స్ లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా యాప్ తో రైతులకు అగ్ని పరీక్ష

## యూరియా యాప్ వైఫల్యం పై బిజెపి మండల ఎస్సీ మోర్చా ఆగ్రహం



**ఎల్కతుర్తి ఫిబ్రవరి 21 ప్రజా మంటలు :**యూరియా సరఫరాలో పాదదర్శకత పేరు తో ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ రైతులకు వరంగా కాక భారంగా మారిందని బిజెపి మండల ఎస్సీ మోర్చా చదిరం రాకేష్ తీవ్రంగా మండిపడ్డారు మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షుడు మస్కుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆదేశాల మేరకు జరిగిన విలేకరుల సమావేశంలో రాకేష్ మాట్లా డుతూ, యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు హింగే శ్రీకా ంత్ చేసిన వాక్యాలను ఖండిస్తూ, యాప్ అమలులో ఉన్న లోపా లను దాచిపెట్టడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. యాప్ ద్వారా యూరియా బుకి ంగ్ చేస్తున్నప్పటికీ సరఫరా ఆల స్యం అవుతుందని కొందరు రైతులు పలుమార్లు రైతు వేదికల చుట్టూ తిరగాల్సి వస్తుందని తెలిపారు. యాప్ ప్రచారం గట్టిగా చేస్తున్నారు కానీ రైతులకు యూరియా మాత్రం దొరకడం లేదు"అని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో నెట్వర్క్ సమస్యలు సర్వర్ డౌన్ అవ్వడం ఓటిపి రాకపోవడం వంటి కారణాలతో రైతులు రోజులు తరబడి తిరుగుతున్నారని ఆరోపించారు. పంటల కీలక దశలో యూరియా కోసం రైతులు రైతు వేదికల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న దృశ్యాలు ఆందోళనకరమని పేర్కొన్నారు. పంటలే మో ఎండిపోతున్నాయి యాప్ మాత్రం తిరుగుతోంది"మండలంలోని ఒక చిన్న రైతు ఆవేదన వ్యక్తం చేస్తూ మూడుసార్లు యాప్ లో నమోదు చేసాం ప్రతి సారి ఏదో లోపం చూపిస్తుంది పంటకు ఇప్పుడే ఎరువు అవసరం ఆలస్యం అయితే నష్టం మాది"అని వాపోయాడు మరో వృద్ధ రైతు మాట్లాడుతూ, మాకు స్మార్ట్ ఫోన్ లేదు పిల్లలపై ఆధారపడాల్సి వస్తోంది యాప్ లేకుండా యూరియా ఇవ్వమంటే ఇవ్వడం లేదు"అని తెలిపారు. బిజెపి మండల ఎస్సీ మోర్చా చదిరం రాకేష్ మాట్లాడుతూ, ఎస్సీ ఎస్టీ మరియు చిన్న రైతులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం నేల మీద పరిస్థితులు తెలుసుకోకుండా డిజిటల్ గణంకాలతో మాయ చేస్తోందని ఆరోపించారు. కొరత లేదంటే క్యూలు ఎందుకు..?"రాష్ట్రంలో యూరియా కొరత లేదని చెబుతున్నారు అయితే రైతు వేదికల వద్ద కనిపిస్తున్న క్యూలు ఏంటి..? సర్వర్ సమస్యలే అయితే వెంటనే పరిష్కారం ఎందుకు చూపడం లేదు..? అని ప్రశ్నించారు. బ్లాక్ మార్కెటింగ్ అరికట్టాల నే పేరుతో రైతులపై అదనపు భారం మోపడం సరికాదని యాప్ లో లోపాలు సరి చేసే వరకు యాప్ లైన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేదంటే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

# ధరణి పోర్టల్‌లో కోడ్ ఆడిటింగ్ - ఇక అక్రమాలకు చెక్

**ధరణి పోర్టల్‌లో అక్రమాలకు చెక్ పేట్టేలా ప్రభుత్వం చర్యలు**

**జనగామ, యాదాద్రి జిల్లాల్లో స్టాంపు డ్యూటీ, చలాన్ల డబ్బు**

**దారి మళ్లింపు ఘటనలతో అప్రమత్తం**

**మళ్లీ జరగకుండా కోడ్ ఆడిటింగ్‌కు నిర్ణయం**




ధరణి పోర్టల్‌లో అక్రమాలకు చెక్ పెట్టేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా కోడ్ ఆడిటింగ్ చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సీ- డాక్‌కి బాధ్యతలు అప్పగించింది.ధరణి పోర్టల్‌లో లోతైన ఆడిటింగ్ వ్యవస్థ తీసుకొచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. కోడ్ ఆడిటింగ్ ఏర్పాటు చేసేందుకు సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్-సి-డాక్‌కు బాధ్యతలు అప్పగించింది. తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ - టీజీఎస్‌ఎస్ (ల+టూా) నేతృత్వంలో సి-డాక్ కోడ్ ఆడిటింగ్‌ను చేపట్టనున్నారు. భూ భారతి పోర్టల్లో ఇటీవల యాదాద్రి-భువనగిరి, జనగామ జిల్లాల కేంద్రంగా స్టాంపు డ్యూటీ, చలాన్ల నగదును కొందరు దారి మళ్లించిన విషయయం తెలిసిందే. ఆ విషయంపై విచారణకు ఏర్పాటు చేసిన హైలెవల్ కమిటీ మరిన్ని లోతైన విషయాలు గుర్తించింది. ధరణి పోర్టల్ ఏర్పాటు నాటి నుంచి కొన్ని రక్షణపరమైన లోపాలు లేవంటూ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి ఆ కమిటీ తీసుకొచ్చింది. దీంతో పోర్టల్‌ను మరింత పకడ్బందీగా తయారు చేయాలని మంత్రి పొంగులేటి ఆదేశాలు జారీ చేశారు.పోర్టల్‌ను మరింత బలోపేతం చేసేలా సాఫ్ట్‌వేర్ రంగంలో పరిశోధన-అభివృద్ధి-ఆర్‌అండ్‌డీలో పట్టున్న కేంద్రప్రభుత్వ సంస్థ సి-డాక్‌కి బాధ్యతలు బాధ్యతలు అప్పగించారు. సాఫ్ట్‌వేర్ సమస్యలు, పరిష్కారాలు, డేటా భద్రతపై ఆ సంస్థ సేవలను రెవెన్యూశాఖ తీసుకోనుంది. ధరణి సాఫ్ట్‌వేర్ రూపొందించిన ప్రైవేట్ సంస్థ గతంలో రక్షణ చర్యలపై దృష్టిసారించలేదని కోడ్ ఆడిటింగ్ లాంటి వ్యవస్థలను ఏర్పాటు చేసుకోలేదని గుర్తించారు. రహస్యంగా లాగిన్లను తెరిచి ప్రభుత్వ భూములను కొల్లగొట్టడం వంటి అక్రమాలకు ఇదొక కారణమని రెవెన్యూ శాఖ అభిప్రాయపడుతోంది. 2020 సంవత్సరం అక్టోబరు నుంచి ధరణి అమల్లోకి రాగా అప్పటి నుంచే సరైన రక్షణ వ్యవస్థలు లేవని, 2024 సంవత్సరం చివరలో టెర్రా ఐసిస్ నుంచి ఎన్ఐసీకి భూముల డేటా బదిలీ చేసిన సమయంలో గుర్తించలేకపోయిందని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి.దాదాపు 75 లక్షల మందికిపైగా రైతులు సుమారు 1.60 కోట్ల ఎకరాల భూములు, లక్షల ఎకరాల ప్రభుత్వ భూముల డేటా నిర్వహణ ఈ పోర్టల్ ద్వారా జరుగుతోంది. రోజుకు సగటున 40 వేల లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో డేటాలో ఏవైనా లోపాలు సమస్యలు వస్తే వాటిని సమీక్షించేందుకు ప్రభుత్వ పరంగా ఒక నిపుణుల వ్యవస్థ లేదు. డేటా నిర్వహణ చేపడుతుండగా సాంకేతికతపై లోతైన అవగాహన, సమీక్షించే నేర్పున్న నిపుణుల అవసరాన్ని ఇటీవల జనగామ ఘటన నొక్కిచెప్పింది. లోపాలు వెలుగు చూసినప్పుడు కమిటీలు వేసి తేల్చడం కన్నా ఏ వ్యవస్థలు అవసరమో గుర్తించి అప్రమత్తం చేసేలా ఒక వింగ్ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# కర్ణాటక రాజకీయాల్లో సంచలం

**బీజేపీ ఎమ్మెల్యే డా చంద్రూలమానీ**

**లంచం కేసులో అరెస్ట్**




**బెంగళూరు ఫిబ్రవరి 21 :** కర్ణాటక రాజకీయాల్లో సంచలన ఘటన చోటుచేసుకుంది. అధికార భారతీయ జనతా పార్టీకి చెందిన ఎమ్మెల్యే చంద్రూలమానీ లంచం కేసులో అరెస్టయ్యారు. మైనర్ ఇరిగేషన్ శాఖకు సంబంధించిన రోడ్డు పక్కన రిటెయినింగ్ వాల్ (రక్షణ గోడ) నిర్మాణ పనుల కేటాయింపుకు గాను రూ.10 లక్షలు లంచం డిమాండ్ చేసిన కేసులో ఆయనను శనివారం కర్ణాటక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.వివరాల్లోకి వెళితే, క్లాస్1 కాంట్రాక్టర్ విజయ్ పూజార్ నుంచి ఎమ్మెల్యే చంద్రూలమానీ మొత్తం రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ లంచంలో తొలి విడతగా రూ.5 లక్షలు తీసుకుంటున్న సమయంలో, లక్ష్మీశ్వర పట్టణంలో ధార్వాడ్ లోకాయుక్తా ఎస్పీ సిద్ధలింగప్ప నేతృత్వంలోని బృందం పక్కా ప్రణాళికతో దాడి చేసి ఎమ్మెల్యేను పట్టుకున్నారు.ఈ కేసులో ఎమ్మెల్యేతో పాటు ఆయన వ్యక్తిగత సహాయకుడు మంజునాథ్ వాల్మీకి, ప్రైవేట్ సహాయకుడు గురు లమానీలను కూడా అధికారులు అరెస్టు చేసి విచారణ చేపట్టారు. లంచం వ్యవహారానికి సంబంధించిన ఆధారాలు సేకరించేందుకు లోకాయుక్తా అధికారులు లక్ష్మీశ్వరలో ఉన్న ఎమ్మెల్యేకు చెందిన బాలాజీ ఆసుపత్రిలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.ఈ ఘటన కర్ణాటక రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ప్రజాప్రతినిధులపై లంచ ఆరోపణలు రావడం ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. ఈ కేసుపై లోకాయుక్తా అధికారులు లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

# క్యూ ఆర్ కోడ్‌తో డ్రైవింగ్ లైసెన్స్

**చిప్‌తో ఉన్న కార్డుల కంటే ఇవే బెటర్**

**డ్రైవింగ్ లైసెన్స్‌కు క్యూఆర్ కోడ్‌తో ఉన్న కొత్త తరహా స్మార్ట్ కార్డులు**

**చిప్‌తో కూడిన కార్డుల కంటే ఇవే మేలని నిర్ణయం**

**వీటి సరఫరా నుంచి డెలివరీ వరకు గుత్తేదారుదే బాధ్యత**




వాహనాల రిజిస్ట్రేషన్ (ఆర్‌సీ), డ్రైవింగ్ లైసెన్స్ (డీఎల్), కార్డులుగా ఇక నుంచి క్యూఆర్ కోడ్‌తో ఉన్న కొత్త తరహా స్మార్ట్ కార్డులను త్వరలో రవాణాశాఖ జారీ చేయనుంది. దీనికి సంబంధించి చిప్‌తో కూడిన స్మార్ట్‌కార్డ్, చిప్ లేకుండా క్యూఆర్ కోడ్‌తో ఉన్న స్మార్ట్ కార్డులలో ఏది ఇవ్వాలనే దానిపై ప్రస్తుతం కసరత్తు జరుగుతుంది. ఈ ప్రక్రియ అనంతరం క్యూఆర్ కోడ్ కార్డులపై మొగ్గుచూపారు. దీంతో 2024 అక్టోబర్ నుంచి పెండింగ్ ఉన్న కార్డులన్నీ జారీ కానున్నాయి.ఏపీలో రోజుకు దాదాపు సగటున 8 నుంచి 10 వేల ఆర్‌సీ, డీఎల్ కార్డులనేవి అవసరమవుతాయి. దీనికి సంబంధించి వీటిలో ఒక్కో కార్డుకు రూ.200 ఫీజుతో పాటుగా తపాలా పోస్టు ద్వారా చేరవేసేందుకు మరో రూ.35 కలిపి మొత్తంగా రూ.235 చొప్పున రవాణాశాఖ వసూలు చేస్తుంది.అయితే వైఎస్సార్సీపీ హయాంలో బకాయిలను చెల్లించకపోవడం వల్ల మధ్య మధ్యలో స్మార్ట్ కార్డుల పంపిణీని నిలిపివేసేవారు. దాంతో దీని ఫలితంగా లక్షల సంఖ్యలో ఎన్నో కార్డులు పెండింగ్‌లోనే ఉండేవి.కానీ చివరకు అంటే 2023 ఆగస్టు 1వ తేదీ నుంచి స్మార్ట్ కార్డుల జారీనే ఆ పేశారంటే పరిస్థితి ఏ రీతిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే గత సాధారణ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు అన్ని ఇతర రాష్ట్రాల్లో స్మార్ట్ కార్డుల జారీ అనేది ఉండటం వల్ల వీటిని మళ్లీ ఇవ్వాలని నిర్ణయాన్ని తీసుకున్నారు. దీని ప్రకారం 2024 అక్టోబర్ 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న వాహనాలను, అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందిన వారికి ఆర్‌సీ, డీఎల్ స్మార్ట్‌కార్డులను జారీ చేసేందుకు ఫీజులను వసూలు చేయడం ఆరంభించింది ఏపీ రవాణాశాఖ.నిబంధనలు ఇలా! అయితే ఈ విధానంలో చిప్‌తో కూడినటువంటి స్మార్ట్ కార్డులను ఇవ్వాలా? లేదా చిప్ లేకుండా క్యూఆర్ కోడ్‌తో ఉన్న కార్డులను ఇవ్వాలా అనేదానిపైన మాత్రం ఇప్పటి వరకు ఎన్నో చర్చలు జరిగాయి. కానీ చిప్ స్మార్ట్ కార్డుల్లోని డేటా ఏంటని తెలియాలంటే మాత్రం చిప్ రీడర్లు కావాలి. అందుకు గాను రవాణా శాఖ వీటిని కొనుగోలు చేయాల్సి ఉంటుంది.ఒకవేళ చిప్‌లేని క్యూఆర్ కోడ్‌తో కూడినటువంటి కార్డుల్లో కేంద్ర రవాణాశాఖకు చెందిన మోహన్, పరివాహన్ పోర్టల్‌తో అనుసంధానం కావడంతో ధృ వీకరణ సమాచారం అనేది ఉంటుంది. దీనికి గాను చిప్‌తో కూడిన ఒక్కో కార్డుకు రూ.57. ప్రింటింగ్ ఖర్చులు, పోస్టల్ ఖర్చులన్నింటితో కలిపి మొత్తంగా రూ.115 వరకు వ్యయం అవుతుందిఒకవేళ అలా కాకుండా క్యూఆర్ కోడ్‌తో ఉండేటటువంటి కార్డులకు రూ.72 వరకు ఖర్చు అవుతోంది. దాంతో వీటన్నింటినీ గమనించిన వాహనదారులు క్యూఆర్ కోడ్ స్మార్ట్ కార్డులపైనే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా ఈ కార్డుల సరఫరా, వీటిపై వివరాలను రాష్ట్రస్థాయిలో ఒకేచోట ముద్రించడం, పోస్టులో పంపడం వంటివన్నీ గుత్తేదారుకే అప్పగించనున్నారు.స్మార్ట్‌కార్డుల జారీకి సంబంధించి అతి త్వరలో టెండర్లను పిలిపించి గుత్తేదారును ఎంపిక చేయనున్నారు. గత 2024 అక్టోబర్ 1వ తేదీ నుంచి గత జనవరి నెలాఖరు వరకు దాదాపు మొత్తం 27 లక్షల కార్డులను జారీ చేయాలి. అంతేకాకుండా 2023వ సంవత్సరం ఆగస్టు నుంచి 2024 సెప్టెంబర్ వరకు స్మార్ట్ కార్డుల జారీని పూర్తిగా నిలిపేసిన నేపథ్యంలో దాదాపు 23 లక్షల కార్డులను ఇవ్వలేదు.గతంలో వాహనాల రిజిస్ట్రేషన్ చేసుకున్నవాళ్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందిన వారిలో ఎవరైనా సరే వారికి ఆర్‌సీ, డీఎల్ కావాలని దరఖాస్తును చేసుకుని ఫీజును చెల్లించినట్లయితే వారికి సైతం క్యూఆర్ కోడ్‌తో ఉన్నటువంటి స్మార్ట్‌కార్డులను రవాణాశాఖ జారీ చేయనుంది.

# నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్ని ప్రమాదం

**'ఫైల్స్‌లోని డేటా రికవరీ చేయడం కష్టం'**

**నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్ని ప్రమాదం**

**ఘటనలో దాదాపు 1,100 ఫైల్స్ దగ్ధం అయినట్లు**

**గుర్తించిన ప్రత్యేక బృందం**

**ఫైల్స్‌లోని డేటా రికవరీ చేయడం కష్టమని తేల్చిన బృందం**





నాంపల్లి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో ఇటీవల జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఘటనలో మొత్తం 1,100 ఫైల్స్ దగ్ధం అయినట్లు నాగ్‌పూర్ నుంచి వచ్చిన స్పెషల్ టీం గుర్తించింది. ఈ దగ్ధమైన ఫైల్స్‌లోని డేటా రికవరీ కోసం ఆ బృందం ఎంతో తీవ్రంగా ప్రయత్నించింది. తాజాగా ఈ ఫైల్స్‌లోని డేటా రికవరీ చేయడం కష్టమని ప్రత్యేక బృందం తేల్చి చెప్పింది.ఈ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో వివిధ కేసుల దర్యాప్తులో ఎఫ్ఎస్ఎల్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో వెంట్రుకలు, ఎలక్ట్రానిక్ డివైజ్‌ల విశ్లేషణ, రక్తం, వేలిముద్రలు, బుల్లెట్లు, లేదా డీఎన్ఏ నమూనాలు, ఆయుధాలు, డాక్యుమెంట్లు ఫోర్జరీ జరిగాయా లేదా ప్రతీది ఇతర అన్ని ఆధారాలను ల్యాబ్‌లోనే పరిశీలించి నివేదికలు సిద్ధం చేస్తారు. ఈ ఆధారాలు ఎన్నో కోర్టు తీర్పుల్లో కీలకంగా ఉంటాయి. కానీ ఈ ప్రమాద ప్రభావం వల్ల కేసుల దర్యాప్తుపై ఎంత వరకు పడనుందనేది ఆందోళనకరమైన విషయం.

# రూ. 49 లక్షలు స్వాహా చిలక్కి చెప్పినట్లు చెప్పినా వినలేదు!

**పోలీసుల మాట వినకుండా సైబరాసురుల ఉచ్చులో పడిన స్టీల్ ప్లాంట్ విశ్రాంత ఉద్యోగి**

**డిజిటల్ అరెస్టని భయపెట్టడంతో రూ.49 లక్షలు బదిలీ చేసిన విశ్రాంత ఉద్యోగి**



కళ్లముందు నిత్యం ఎన్నో మోసాలు, డిజిటల్ అరెస్టులు, వందల సంఖ్యలో సైబర్ నేరాల గురించిన వార్తలను ప్రతిరోజు చూస్తున్నాం. సైబర్ నేరస్థుల వలలో పడి కోట్లు పోగొట్టుకున్న అమాయకపు ప్రజలు ఎందరో ఉన్నారు. అప్రమత్తతపై ఎప్పటికప్పుడు అధికారులు హెచ్చరిస్తున్నా, సరే తగిన సూచనలను ఇస్తున్నా, అత్యాశతో బాధితులు ఈ నేర ఉచ్చులో పడుతున్నారు. ఇలాంటి ఘటనే విజయవాడలో చోటు చేసుకుంది. అసలు ఏం జరిగిందంటే?డిజిటల్ అరెస్టు అనే పదమే ఎక్కడా లేదు. ఆ పేరుతో వచ్చే కాల్స్‌కు స్పందించవద్దని పోలీసులు ఆ రిటైర్డ్ ఉద్యోగికి చిలక్కి చెప్పినట్లు చెప్పారు. రూ.72.50 లక్షలు బదిలీ చేసేందుకు బ్యాంకుకు వచ్చిన అతణ్ని వెనక్కి పంపించారు. ఎవరైనా ఇబ్బంది పెడితే తమను సంప్రదించాలని భరోసా ఇచ్చారు. 15 రోజుల్లో మళ్లీ సైబర్ నేరగాళ్ల నుంచి అతనికి ఫోన్ కాల్ వచ్చింది. దీంతో మోసగాళ్లకు రూ.49 లక్షలు బదిలీ చేశారు ఆ విశ్రాంత ఉద్యోగి.విజయవాడలో స్థిరపడిన స్టీల్ ప్లాంట్ విశ్రాంత ఉద్యోగికి గత నెలాఖరులో ఈడీ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ ఓ కాల్ వచ్చింది. మీ పై కేసులు ఉన్నాయని బెదిరించారు. యూనిఫాంలో వీడియో కాల్ చేసిన వ్యక్తి రూ.72.50 లక్షలు ఇవ్వాలని, అలా చేస్తే మీ కేసు మాఫీ చేస్తానని అన్నాడు.దీంతో రిటైర్డ్ ఉద్యోగి విజయవాడ రామచంద్రనగర్‌లోని ఎస్‌బీఐ బ్రాంచికి వెళ్లారు. తన పేరిట ఉన్న రూ.78 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లను రద్దు చేసుకున్నారు. అందులో నుంచి రూ.72.50 లక్షలను మరో అకౌంట్‌కు బదిలీ చేయాలని కోరారు. అనుమానం వచ్చిన బ్యాంకు అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఖాతా నంబరు పరిశీలిస్తే అది కోల్‌కతాకు చెందినదని తేలింది.దీంతో పోలీసులు ఆ లావాదేవీ నిలివేశారు. డిజిటల్ అరెస్టు మోసాలపై అవగాహన కల్పించారు. తర్వాత మళ్లీ బ్యాంకుకు వచ్చిన విశ్రాంత ఉద్యోగి బెంగళూరుకు మారిపోతున్నాము అంటూ ఎఫ్‌డీ క్లోజ్ చేశారు. ఆ మొత్తాన్ని తన పొదుపు అకౌంట్‌లోకి బదిలీ చేయించుకున్నారు.అనంతరం ఇండియన్ బ్యాంకులో అకౌంట్ తెరిచారు. అక్కడి నుంచి మోసగాళ్ల ఖాతాకు రూ.49 లక్షలు బదిలీ చేశారు ఆ విశ్రాంత ఉద్యోగి. ఆ సమయంలో బ్యాంకు సిబ్బంది అతన్ని ప్రశ్నించారు. ఆయన తెలిసిన వ్యక్తికే పంపిస్తున్నామని చెప్పారు. తీరిగ్గా 4 రోజుల తర్వాత పోలీసులను ఆశ్రయించారు. తనకు మళ్లీ అదే ఫోన్ కాల్ వచ్చిందనీ, మోసగాళ్లు బెదిరించడంతో బదిలీ చేశానని ఆయన పోలీసులకు చెప్పారు. తాను పోగొట్టుకున్న సొమ్మును తిరిగి ఇప్పించాలని అర్థించారు.ఇదిలా ఉండగా మరోవైపు సైబర్ నేరాల పట్ల ఉన్న అవగాహనతో ఓ వృద్ధ జంట చాకచక్యంగా బయటపడ్డారు. పోలీసులు కల్పిస్తున్న అవగాహనతో సైబర్ నేరస్థులకు చెక్ పెట్టారు. కృష్ణా జిల్లా ఉయ్యూరులో సైబర్ నేరస్థుల నుంచి ఈ మధ్యకాలంలో రిటైర్డ్ అయిన వృద్ధులను లక్ష్యంగా చేసుకొని కోట్లు కొల్లగొడుతున్న డిజిటల్ అరెస్ట్ సైబర్ నేరం నుండి కృష్ణా జిల్లా ఉయ్యూరు టౌన్ పోలీసులు ఇద్దరు వృద్ధులను కాపాడారు.డిజిటల్ అరెస్ట్ అనే పదం కానీ పద్ధతి గాని ఎక్కడా లేదని ముంబై క్రైమ్ బ్రాంచ్, ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్, కస్టమ్స్, సీబీఐల నుండి మాట్లాడుతున్నాం మీ ఆధార్ కార్డు సిమ్ కార్డులు మనీ ల్యాండరింగ్‌లో ఇరుక్కున్నాయి లేదంటే డ్రగ్స్ రవాణాలో ఇన్వాల్వ్ అయ్యి ఉన్నాయి, అని ఎవరైనా బెదిరిస్తే వెంటనే స్థానిక పోలీస్ వారికి గాని, 1930 గాని రిపోర్ట్ చేయాలని ఈ సందర్భంగా కృష్ణాజిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలియజేశారు.

# 'ఏఐ'ని అదుపుచేసి ముందుకు వెళ్లాలి

**మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమో**

**వెంకయ్యనాయుడు ఆందోళన**

**విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండకుండా ఏఐని**

**కట్టడి చేయాలన్న మాజీ ఉప రాష్ట్రపతి**

**మన కట్టు, బొట్టుకు ప్రాధాన్యత ఇవ్వాలన్న వెంకయ్యనాయుడు**

**భారత్ విశ్వగురువు అయినా ఏ దేశం మీదా**

**దండయాత్ర చేయలేదన్న వెంకయ్యనాయుడు**



కృత్రిమ మేధ(ఏఐ)ని అదుపుచేసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఏఐ వస్తే మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమోననే భయం తనకు ఉందని అన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండకుండా ఏఐని కట్టడి చేయాల్సి ఉందని అన్నారు. విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశాన్ని, మాతృభాషను, చదువుకున్న విద్యా సంస్థను, గురువులను మరిచిపోకూడదని అన్నారు. మన కట్టు, బొట్టుకు ప్రాధాన్యత ఇవ్వాలని, తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని అన్నారు. యువత పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. మన పూర్వీకులు మనకు అందించిన సంప్రదాయాలని భావితరాలకు అందించాలని వ్యాఖ్యానించారు.భారత్ విశ్వగురువు అయినప్పటికీ ఏ దేశం మీదా దండయాత్ర చేయలేదని గుర్తు చేశారు. భారత్ సత్తాను ప్రపంచ వేదికల మీద మన వారు చాటుతున్నారని ప్రశంసించారు. కులం కంటే గుణం మిన్న అనే విషయాన్ని అందరూ గుర్తించాలని అన్నారు. డిగ్రీల కంటే పరిజ్ఞానం ముఖ్యమని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాంకేతికతకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.భవిష్యత్తులో చాలా రంగాల్లో ఉద్యోగాలు పోయే అవకాశం ఉందని, దీని గురించి మాట్లాడాల్సిన అవసరం ఉందని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో నాయకులు బూతులు విపరీతంగా మాట్లాడుతున్నారని, గత ఎన్నికల్లో బూతులు మాట్లాడిన వారు ఓడిపోయారని వెల్లడించారు. సమాజం కూడా అలాంటి వాళ్లను బహిష్కరించాలని హితవు పలికారు. రామాయణాన్ని అన్ని పాఠ్యపుస్తకాల్లో పొందుపరచాలని అన్నారు.తల్లిదండ్రులు, ఇంట్లోని పెద్దలు తమ పిల్లలకు ఎక్కువ సమయం కేటాయించాలని వెంకయ్యనాయుడు సూచించారు. విద్యార్థులు, యువత ప్రతి దానికి గూగుల్ మీద ఆధారపడుతున్నారని, కానీ వారు దీనిని పక్కన పెట్టి బుర్రకు పని చెప్పాలని సూచించారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com